
కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన దసరా ఉత్సవాల్లో పాల్గొన్న డీసీసీ మాజీ అధ్యక్షుడు ప్రతాప్


కొంపల్లిలో రావణ దహనంలో మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్


జర్నలిస్ట్ కాలనీలో నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న మహిళలు

దసరా సంబరం

- శుభాకాంక్షలు తెలుపుకున్న నేతలు, ప్రజాప్రతినిధులు
- సంప్రదాయబద్ధంగా శమీ పూజ
- రావణ దహనంలో పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు

కుత్బుల్లాపూర్: దసరా పర్వదినాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం శమీ పూజ నిర్వహించారు. చెడుపై మంచి విజయానికి సూచికగా రావణ దహన కార్యక్రమాలు నిర్వహించగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమాలను బాణాసంచా కాలుస్తూ ఘనంగా నిర్వహించారు. దసరా సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులను, వివిధ రాజకీయ పక్షాల నాయకులను అభిమానులు, కార్యకర్తలు కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. దుండిగల్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలో జరిగిన దసరా వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను సన్మానిస్తున్న సంక్షేమ సంఘాల నేతలు




బాచుపల్లిలో జెండాను ఎగురవేసిన మాజీ ఎమ్మెల్సీ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్


ఎమ్మెల్యే వివేకానంద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి


కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు


దూలపల్లిలో రావణ దహనం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు


దుండిగల్‌లోని శ్రీగణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమంలో జరిగిన దసరా ఉత్సవాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


శామీర్‌పేట్‌లో ఎంపీ రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శేఖర్‌యాదవ్


మాణిక్యనగర్‌లో జరిగిన శమీపూజలో ఎమ్మెల్యే వివేకానంద్


నిజాంపేట్‌లో జరిగిన శమీ పూజలో..

గుర్రపు డెక్కను తొలగించరా?

నిజాంపేట్: చెరువుల సుందరీకరణను అధికారులు అటకెక్కించారు. దీంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన పలు చెరువులు గుర్రపు డెక్కతో నిండిపోయాయి. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని తుర్క చెరువులోని చుట్టు పక్కల ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీల వ్యర్థాలను వదలడంతో గుర్రపు డెక్క పూర్తిగా కప్పేసింది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమల నివాసంగా మారింది. కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు చెరువు సమీపంలోని కాలనీ వాసులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువుల సుందరీకరణకు లక్షలాది నిధులు వెచ్చిస్తున్నామని అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. ఇందుకు తుర్క చెరువును ఉదాహరణలో పేర్కొనవచ్చు. ఇప్పటికైనా అధికారులు తుర్క చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి స్వచ్ఛ జలాలతో చెరువును నింపాలని, మురుగునీరు చేరకుండా ప్రత్యేక పైపు లైన్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


గుర్రపు డెక్కతో నిండిపోయిన తుర్క చెరువు

ప్రొఫెసర్ సాయిబాబాకు ఘన నివాళి

జగద్గిరిగుట్ట: ప్రజా సమస్యలపై అలు పెరుగని పోరాటం చేసిన యోధుడు ప్రొఫెసర్ సాయిబాబా అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ఆయన చిత్రపటానికి పూలమాలలేసి ఆదివారం జగద్గిరిగుట్ట కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజకీయ కుట్రలకు సాయిబాబా బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో హరినాథ్, బాబు, వెంకట్, ప్రభాకర్, సోమన్న, నారాయణ, దక్షిణమూర్తి, సుందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

యువకుడు దారుణ హత్య


నదీంపాషా(ఫైల్)

జగద్గిరిగుట్ట: పాత గొడవల నేపథ్యంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరసింహ వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా భూదేర ప్రాంతానికి చెందిన అక్బర్ పాషా కుటుంబం 3 సంవత్సరాలుగా జగద్గిరిగుట్టలోని దీనబందు కాలనీలో నివాసం ఉంటుంది. కాగా అక్బర్ కుమారుడు నదీం పాషా(21) బ్యాండ్ మేళంలో పని చేస్తున్నాడు. నదీం పాషాతో స్థానికంగా ఉండే కొందరితో గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ముకుమ్మడిగా నదీంపై బండ రాళ్లతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు.. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. నదీం సోదరి అయేషా ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేసిన జగద్గిరిగుట్ట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నదీంను అత్యంత కిరాతంగా హత్య చేయాల్సిన బలమైన కారణం ఏమై ఉంటుందన్న కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

రైతు బిడ్డ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో దిట్ట

- నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి శభాష్ అనిపించుకున్న సుమంత్‌రెడ్డి
- ఆర్థిక ఇబ్బందులున్న లక్ష్యం వైపే..

సుభాష్‌నగర్: ప్రస్తుత రోజుల్లో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే నానా కష్టాలు పడాల్సిందే. కానీ ఆ యువకుడిని ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా వాటిని లెక్కచేయకుండా ఓవైపు చదువుతూ మరోవైపు ట్యూషన్లు చెబుతూ ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాడు. అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. కష్టపడితే చదివితే సాధించలేనిది ఏమీ ఉండదని నిరూపించాడు. సూరారానికి చెందిన మేరెడ్డి సుమంత్ రెడ్డి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. ఎంటెక్ పూర్తి చేసిన ఇతను మొదటగా 2020లో చదువుతూ కేంద్రానికి సంబంధించిన బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్(బీఆర్‌ఓ) ఉద్యోగాల పరీక్షల్లో దేశవ్యాప్తంగా ఆరు లక్షల మంది రాయగా సుమంత్ రెడ్డి అర్హత పొంది ఉద్యోగం సాధించాడు. కానీ ఆ ఉద్యోగం వదిలేసి చదువుతూ సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రస్తుతం మైసూర్‌లో జేఈ సివిల్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తూనే ఇటీవల జరిగిన టి.జి.పి.ఎస్.సిలో రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది పరీక్షలు రాయగా.. 82వ ర్యాంక్ సాధించి ఆర్‌అండ్‌బీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా గెజిటెడ్ హోదాలో ఉద్యోగం సాధించాడు. అదేవిధంగా పాలిటెక్నిక్ లెక్చరర్‌గా ఇలా వారం వ్యవధిలో రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. దీంతో కుటుంబంలో ఆనందానికి అవధులు లేకుండా పోయింది.


సుమంత్ రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న అమ్మానాన్న

వ్యవసాయ కుటుంబం నుంచి..

నల్గొండ జిల్లా లింగోట గ్రామానికి చెందిన మేరెడ్డి భాస్కర్ రెడ్డిది వ్యవసాయ కుటుంబం. అతను 1992లో సూరారానికి వలస వచ్చాడు. స్థానికంగా ఓ ఫార్మా కంపెనీలో చిరు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇతని కుమారుడు మేరెడ్డి సుమంత్ రెడ్డి, పాప ధరణి సంతానం.

నా లక్ష్యం ఐఈఎస్...



మమ్మల్ని అమ్మానాన్న చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడి చదివించారు. ఇంటర్ చదివేందుకు ఆర్థిక స్థోమత అంతగా లేక పోవడంతో డిప్లొమా చదివాను. ఓవైపు ట్యూషన్ చెబుతూ మరోవైపు చదువును కొనసాగించా. చదువుతూనే ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన చూసి ముందుగా 30 పరీక్షలు రాశాను. అందులో చాలా వరకు ఒకటి, రెండు మార్కుల తేడాతో సాధించలేకపోయాను. ప్రస్తుతం గెజిటెడ్ హోదాలో నాకు ఉద్యోగం వచ్చింది. అయినప్పటికీ నా ప్రయాణం ఆపేది లేదు. నా లక్ష్యం ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్(ఐఈఎస్) సాధించి తీరుతా. - సుమంత్‌రెడ్డి